

ప్రగతి భవన్‌ను ప్రజా దర్బార్‌గా మార్చాం 8

8 జోరుగా ఇసుక అక్రమ రవాణా - ఒకే కూపన్‌పై రోజంతా సరఫరా



దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

8 రోజులు 1,90,965 దరఖాస్తులు

- జిల్లాలో అభయ హస్తం దరఖాస్తులకు విశేష స్పందన
- ఆరు గ్యారెంటీలపై ప్రజల్లో ఆశలు
- సాఫీగా 'ప్రజాపాలన' సభలు
- పర్యవేక్షించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్, అధికారులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అర్హులకు ఆరు గ్యారెంటీలను అందించే దిశగా తెలంగాణ నూతన ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన' సభలు సాఫీగా ముగిశాయి. జిల్లాలో గత నెల 28న మొదలై ఈ నెల 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన సభలు, అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం ప్రజాపాలన సభలు ముగిసే వరకు ఆరు గ్యారెంటీలపై దరఖాస్తులు వచ్చాయి. రెండు రోజులు సెలవులు మినహా 8 రోజుల పాటు నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణలో ఆరు గ్యారెంటీలకు సంబంధించి లక్షా 90వేల 965 దరఖాస్తులు రాగా, రేషన్ కార్డులు, ఇతర అవసరాల కోసం సంబంధించి 28,564 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తులు వచ్చిన తీరు

తేది	గ్యారంటీ దరఖాస్తులు	ఇతర
28-12.2023	11382	----
29-12.2023	17540	2075
30-12.2023	24049	2648
02-01-2024	30488	3647
03-01-2024	28526	4409
04-01-2024	26365	5033
05-01-2024	12458	2802
06-01-2024	40157	7950
మొత్తం	1,90,965	28,564

● ప్రభుత్వ విప్, ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి వంద రోజుల్లోనే పథకాలు అందించాలనే లక్ష్యంతో మొదలు పెట్టిన ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే మొదలు పెట్టారు. మిగతా పథకాల కోసం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు ప్రజాప్రతినిధులు పర్యవేక్షించారు. లాంఛనంగా ప్రారంభించి లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా ప్రజాపాలన నోడల్ అధికారి శ్రీదేవసేన తనిఖీ చేశారు. ప్రజాపాలన సభలకు సంబంధించిన కార్యక్రమాల్లో అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారు సైతం ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

● దరఖాస్తుల ఆన్‌లైన్‌కు ప్రత్యేక సాఫ్ట్‌వేర్

ప్రజాపాలనలో స్వీకరించిన ఆరు గ్యారెంటీల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో 67 వార్డుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో శిక్షణ అందించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తలెత్తే ఇబ్బందులను ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు.

● పథకాలపై ఆశలు

జిల్లాలో దరఖాస్తు చేసుకున్నవారు ఆరు గ్యారెంటీల అమలుపై ఆశలు పెంచుకున్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ప్రభుత్వం మహాలక్ష్మీ పథకంలో ప్రతీ మహిళకు రూ.2500 చొప్పున భృతి చెల్లించనుంది. దీని ప్రకారం 18 సంవత్సరాలు దాటిన మహిళల్లో 2లక్షల మంది అర్హులు ఉన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.500కు అందించడం ద్వారా జిల్లాలో 1.49 లక్షల గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారులకు ప్రతీ నెలా రూ.2.21 కోట్లు ఆదా కానున్నాయి. గృహలక్ష్మీ పథకంలో జిల్లాలో మొదటి విడతలోనే 22,126 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం లేనివారికి స్థలంతోపాటు రూ.5 లక్షలు అందించే అవకాశం ఉండడంతో గృహ లబ్ధి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, యువ వికాసం పేరిట విద్యార్థులకు రూ.5 లక్షల విద్య భరోసా కార్డుపై ఆసక్తి పెరిగింది. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 48,028 మంది ఉన్నారు. జిల్లాలో 1,34,725 మంది రైతులు 132.50 కోట్ల మేరకు రైతు బంధు సాయం అందుకుంటున్నారు. వీరికి ప్రస్తుతం ఎకరానికి రూ.10 వేలు అందుతున్న ఆర్థికసాయం రూ.15 వేలకు చేరనుంది. జిల్లాలో కౌలు రైతులు 80 వేల మంది వరకు ఉండగా ఎకరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందనుంది. ఆరోగ్య శ్రీ, పింఛన్ల పెంపు, రేషన్ కార్డులకు కూడా దరఖాస్తులు అందజేశారు.

● 255 గ్రామ పంచాయతీలు, రెండు మున్సిపాలిటీలు

జిల్లాలో 12 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, 255 గ్రామ పంచాయతీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ప్రజాపాలన సభలు నిర్వహించారు. మహాలక్ష్మీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇంళ్లు, చేయూత పథకాలతోపాటు రేషన్ కార్డులకు దరఖాస్తులు ఇచ్చారు. అధికారులు కూడా షెడ్యూల్ ప్రకారం సభలు నిర్వహిస్తూ ముందుకు సాగారు.



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి

ఉద్యమ కారుల కోటా కింద దరఖాస్తు

- రాచర్ల వెంకన్న, ఉపాధ్యాయుడు

1996 నుంచి 2014 వరకు ఉద్యమంలో తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం పనిచేశాను. తెలంగాణ ఐక్యవేదిక, తెలంగాణ జనసభ, తెలంగాణ విద్యావంతుల వేదిక, టీజేఏసీలో కో ఆర్డినేటర్‌గా కీలకంగా పని చేస్తూ ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యను అందించాను. ఒక ఇల్లు కూడా సంపాదించుకోలేకపోయాను. నూతన ప్రభుత్వం ప్రకటించినా ఉద్యమ కారులకు కేటాయించిన కోటాలో ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ప్రొఫెసర్ జయశంకర్, ప్రొఫెసర్ కోదండరాం, కేసీఆర్, కేటీఆర్‌తోపాటు ఇతర అన్ని పార్టీలతో కలిసి పనిచేశాను. టీఆర్ఎస్‌తో అనుబంధం ఏర్పడింది. నిజాయితీగా నిస్వార్థంగా ఉద్యమంలో పనిచేశాను.

నేడు ముత్యాల ముగ్గుల పోటీ

- వేములవాడ రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లు
- ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహణ

సిరిసిల్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆంధ్రజ్యోతి - ఏబీఎన్, కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీ పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, స్థానిక స్పాన్సర్స్ వేములవాడలోని హోమ్‌టౌన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ముగ్గుల పోటీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. వేములవాడలోని మల్లారం రోడ్డులో రాజశ్రీ ఫంక్షన్‌హాల్‌లో ముగ్గుల పోటీ నిర్వహించనున్నారు. వయోభేదం లేకుండా మహిళలందరూ పోటీలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, రెండో బహుమతిగా రూ.4 వేలు, మూడో బహుమతిగా రూ.3 వేలు, కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 7013840728, 8074511657 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

తంగళ్లపల్లి, జనవరి 6: తంగళ్లపల్లి మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం కన్నుల పండువగా సాగింది. మానేరు నది ఒడ్డున గుట్టపై లక్ష్మీనర్సింహ ఆలయాన్ని నిర్మించి నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. మయూర గిరి పీఠాధిపతి నమిలికొండ రమణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ధ్వజస్తంభ స్థాపన, నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన చేపట్టారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఓం ప్రకాష్ గుప్తా సేవలను మరువలేం

సిరిసిల్ల టౌన్, జనవరి 6: టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ జాతీయ నాయకుడు ఓం ప్రకాష్ గుప్తా సేవలను మరువలేమని టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు రామినేని ఫణిరాజారావు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం టెలిఫోన్ కార్యాలయం వద్ద టెలికాం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఓం ప్రకాష్ గుప్తా 12వ వర్ధంతిని నిర్వహించారు. ఓం ప్రకాష్ గుప్తా చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఈ పరకాల రమేష్, ఎస్డీఈ జనార్ధన్, సిబ్బంది, యూనియన్ నాయకులు తిరుమల్, నరేష్, సత్యానంద్, వెంకటేశ్వర్లు, రవి, లక్ష్మన్, మోతిలాల్, వనజా, బాలవ్వ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేసినప్పుడే ముందడుగు



కార్యాలయాలను ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, జనవరి 6: సమన్వయంతో పని చేసినప్పుడే ముందడుగు వేస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలోని పైఅంతస్థులో నూతనంగా నిర్మించిన వివిధ కోర్టుల సెక్షన్ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యాలయాల నిర్మాణంలో బార్ అసోసియేషన్ పాత్ర ఎంతో ఉందన్నారు. బార్ అండ్ బెంచ్ మధ్య సహాయసహకారాలు ఉన్నప్పుడే పురోభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లా కోర్టులు ఏర్పడినప్పటి నుంచి కోర్టులకు న్యాయవాదుల చేయూతనివ్వడం మరిచిపోలేదన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా కోర్టుకు జడ్జిగా రావడం మరిచిపోలేమన్నారు. అందరు కలిసి బాగా పనిచేయాలన్నారు. జిల్లాలో దాదాపు 10వేల పెండింగ్ కేసులు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడలో 9కోర్టులు ఉన్నాయన్నారు. మరో సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు మంజూరైందని, త్వరలో ప్రారంభించనున్నామని అన్నారు. త్వరలో ఎస్సీ, ఎస్టీ కోర్టు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో సెషన్స్ కోర్టు మంజూరైతే వేములవాడలో ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా కోర్టు సముదాయం నిర్మాణానికి కేటాయించిన 10ఎకరాల స్థలం అనువుగా లేదన్నారు. ప్రస్తుతం ఉన్న 5ఎకరాల లోపు కోర్టు స్థలాన్నే వినియోగించుకొని నూతన భవనాలను నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, బార్ అసోసియేషన్ కార్యదర్శి అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు వసంతం, భాస్కర్, ధర్మేందర్, సంజీవరెడ్డి, రవీందర్‌రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్ పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆపరేషన్ స్మైల్ - 10 కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల చివరి వరకు కార్యక్రమాల అమలుపై అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, అదనపు ఎస్పీ చంద్రయ్యతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, కార్మిక, విద్యా, మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. భిక్షాటన చేస్తున్న పిల్లలు, వీధి బాలలను గుర్తించాలన్నారు. తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకున్నవారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల సంస్థపై చర్చిస్తూ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేయాలన్నారు. దివ్యాంగులను ఎవరైనా కించపరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌జెండర్‌లకు పునరావాసం, ఐడీ కార్డులను అందించే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రుల్లో బ్యాంకుల్లో వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. సఖి కేంద్రానికి వచ్చే మహిళలకు న్యాయమైన సేవలు అందించాలన్నారు. ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు అందుతున్న పోషకాహారాన్ని తనిఖీ చేయాలని సీడీపీవోలను ఆదేశించారు. మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి పనిచేసే ప్రదేశాల్లో నివారణ కోసం ఇంటర్నల్ ఫిర్యాదుల కమిటీల ద్వారా వివరాలు సేకరించాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అంజయ్య, జిల్లా విద్యాధికారి రమేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, బీసీ వేల్ఫేర్ అధికారి మోహన్‌రెడ్డి, ఎస్డీసీ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి సహకారం

తంగళ్లపల్లి, జనవరి 6: లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డి, జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మయూరగిరి పీఠాధిపతి నమిలికొండ రమణాచార్యస్వామి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య, అకునూరి బాలరాజు, సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, సామాల పావని. కాముని వనిత, జల్గం ప్రవీణ్, మచ్చ శ్రీనివాస్, సుద్దాల శ్రీనివాస్, లక్ష్మిరాజం, శేఖర్, ఎగుర్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఇల్లంతకుంట, జనవరి 6: ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ అన్నారు. మండలంలోని రేపాక, వెంకట్రావుపల్లె గ్రామాల్లో శనివారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు. ఐకమత్యంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. అంతకుముందు అనంతగిరి గ్రామంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం పోచమ్మతల్లిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచులు రొండ్ల లక్ష్మి, మంద సుశీలలింగయ్య శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు కాథ సుమలతమల్లేశం, గొట్టెపర్తి పర్శరాం, ఉపసర్పంచ్ బాలకిషన్, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


తప్పులు దొర్లకుండా చూడాలి

సిరిసిల్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో గ్యారెంటీ పథకాల కోసం వచ్చిన దరఖాస్తులను పొరపాట్లు లేకుండా, జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సూచించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల డేటా ఎంట్రీని పరిశీలించారు. వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దరఖాస్తు ఫారాలు బయటికి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను శనివారం ఆమె పరిశీలించారు. డేటా నమోదును అడిగి తెలుసుకున్నారు. నమోదులో పలు సూచనలు చేశారు. ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తుల వివరాలను పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తులు గల్లంతు కాకుండా జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్‌అహ్మద్ ఉన్నారు.







యూనివర్సిటీ భూములు కబ్జా చేస్తే ఊరుకోం

● ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేష్



ఫార్మసీ కళాశాల భూములను పరిశీలిస్తున్న వీసీ, ఎస్‌యూ సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన యూనివర్సిటీ కళాశాల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్. మల్లేష్ హెచ్చరించారు. రెండు రోజుల నుంచి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూములను కళాశాల పక్కనే ఉన్న ప్రైవేట్ భూములతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేసే ప్రయత్నం చేయగా వెంటనే దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాల భూములను ఇకపైన ఎవరూ కబ్జా చేయకుండా పూర్తి స్థాయి ఫెన్సింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు వేస్తామన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● ఫార్మసీ కళాశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

గణేశ్‌నగర్,జనవరి 6: ఎస్‌యూ భూమిపై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ ఎదుట శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పుసాల విష్ణు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ ఫార్మసీ కళాశాల భూమిని చదును చేసిన విషయంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఉపకులపతి మల్లేష్ లేదా డ్రాయింగ్ ఆఫీసర్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ జయంతితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉన్నా వారు ఒక కాంట్రాక్ట్ అధ్యాపకుడితో ఫిర్యాదు చేయించడం, బాధ్యుడిగా చేసే ప్రయత్నం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ప్రభుత్వ అండదండలతో ఉపకులపతి, ఆయన అనుకూల వర్గం ఏం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వం అయినా శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ సమితి సభ్యుడు అంజన్న, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మధు, లాఫోరం కన్వీనర్ ప్రమోద్, శ్రీ వర్ధన్, సాయి, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం

ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా నాగేందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జనవరి 6: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్‌సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా ఛైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ అలీలు ప్రకటించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారికి నాగేంద్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, జనవరి 6 : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఆనారోగ్యం కారణంతో ఒల్లెం మల్లు (78) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. మల్లు గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి, నరాల బలహీనతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో వ్యాధి గురించి తరచుగా బాధపడుతుండేదని పోలీసులు, బంధువులు తెలిపారు. మల్లు శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో తాను పడుకున్న మంచంతో పాటు దుప్పటికి నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మల్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మల్లు కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి

శంకరపట్నం, జనవరి 6: మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో రైతు పొలంలోనే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాతంగి ఓదెలు (55) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. ఓదెలు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెతకగా పొలంలో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, జనవరి 6: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులో శనివారం సాయంత్రం గంగాధరకు చెందిన పలువురు పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి 16వేల 300 రూపాయల నగదును పట్టుకున్నట్లు ఎస్సై కె. వెంకట్‌రావు తెలిపారు. 10 మోటార్‌సైకిళ్ల, 12 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

వేములవాడ టౌన్, జనవరి 6: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శనివారం ఒక ప్రకటన ద్వారా వేటగాళ్లను హెచ్చరించారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల, రుద్రంగి మండలం మానాల గ్రామాల్లో ఇటీవల వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇద్దరు అమాయకులు మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపించామని తెలిపారు. పంట పొలాలను కాపాడేందుకు రైతులు, వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రామడుగు ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు, జనవరి 6: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ఈ నెల 17న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీటీసీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో కలిసి గత నెల 19న ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన ఈ నెల 8న అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం నిర్వహించుటకు నోటీస్ జారీ చేశారు. అయితే ఎంపీపీ దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ వేయడంతో 8న నిర్వహించనున్న అవిశ్వాస తీర్మానం ఆపాలని స్టే విధించింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి బ్రేక్ పడింది. ఎంపీపీ, జడ్పీటీసీ, ఆర్డీవోకు హైకోర్టు స్టేను సమర్పించినట్లు విలేకరులతో ఎంపీపీ తెలిపారు.

పోక్సో బాధితులకు సహాయం అందించాలి

తిమ్మాపూర్, జనవరి6: పోక్సో బాధితులను గుర్తించి కావలసిన సహాయం అందించాలని మహాత్మానగర్ సర్పంచ్ జక్కని శ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో భిక్షాటన చేసే పిల్లలను గుర్తించాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాటు పడాలన్నారు. గ్రామల్లో బాల్య వివాహాలను నిరోధించడంలో గ్రామ పంచాయతీ పాలకులు ఆయా శాఖల అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని చట్టబద్ధమైన దత్తతను గుర్తించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల హక్కులను కాపాడేలా అధికారులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపిఓ ఆరవింద, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్‌లో ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల హుజరాబాద్‌లో- 2, అల్ఫోర్స్, డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరీంనగర్‌లో-1, సెమిస్టర్-3లో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హుజురాబాద్‌లో-1 అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఏడుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 6: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో ఒకరికి పది రోజులు, మరొకరికి ఐదు రోజులు, మరో ఐదుగురికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 45మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి జైలుశిక్షతో పాటు 14,500 జరిమానా విధించారని తెలిపారు. మిగతా 38 మంది వాహనదారులకు 66 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన

- నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహణ - ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన



లాలపల్లిలో మాట్లాడుతున్న శ్రీదేవసేన

ఎలిగేడు, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అమలు చేసేందుకు ప్రజలనుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన వచ్చిందని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన అన్నారు. శనివారం మండలంలోని లాలపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాపాలన ఉమ్మడి జిల్లా కరీంనగర్ నోడల్ అధికారి శ్రీదేవసేనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన దరఖాస్తుదారులతో శ్రీదేవసేన ముచ్చటించారు. అనంతరం ఆమె లాలపల్లిలో మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు పెద్దపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దపల్లి కలెక్టర్‌గా రెండున్నర సంవత్సరాల పాటు తాను పనిచేయడం తన కెరియర్‌లో ఒకమైలురాయిగా నిలిచిపోతుందన్నారు. గ్యారంటీ పథకాలపై మంచి అవగాహనతో ప్రజలు వారికి అవసరమైన పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. నాలుగునెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేసి, నిర్దిష్ట ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం అర్హులను ఎంపికచేసి పథకాలను అమలుచేస్తామని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలకు పథకాలను అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగమే గ్రామాల్లో ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. నూతన రేషన్‌కార్డుల కోసం సైతం ప్రజాపాలన కార్యక్రమంలో తెల్లకాగితంపై దరఖాస్తు సమర్పించాలని, రేషన్‌కార్డు దరఖాస్తులు, ఇతర దరఖాస్తుల సమర్పణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఎన్ శిరీష, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏఐఏఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడిగా దమ్మన్నపేట విద్యార్థి



రామ్ విలాస్

గంభీరావుపేట, జనవరి 6: ఆల్ ఇండియా అగ్రికల్చరల్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఏఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రామ్ విలాస్ పాశ్వన్ ఎన్నికయ్యాడు. ఆల్ ఇండియా అగ్రికల్చర్ స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా రామ్‌విలాస్‌ను ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ప్రకటించారు. దమ్మన్నపేటకు చెందిన విస్లావత్ లోక్యా నాయక్, సత్తవ్వ దంపతుల కుమారుడు రామ్‌విలాస్ పాశ్వన్. ఇతను ఐసీఏఆర్ భారత వ్యవసాయ పరిశోధన విద్యాయలంలో (న్యూఢిల్లీ)లో పరిశోధనలను కొనసాగిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి అన్ని రాష్ట్రాల విద్యార్థుల నామినేషన్‌కి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. దీనికి గాను అన్ని రాష్ట్రాల నుంచి 304 మంది నామినేషన్‌లు వేశారు. వారి యొక్క కార్యకలాపాలను, ఆలోచన లు పరిగణలోకి తీసుకుని నామినేషన్ రిటర్నింగ్ అధికారులు మంచి ప్రతిభ కనబర్చిన రాంవిలాస్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణాదారులపై టాస్క్‌ఫోర్స్ స్పెషల్‌డ్రైవ్

- ఆరుగురి బైండోవర్

కోల్‌సిటీ, జనవరి 6: గంజాయి నిర్మూలించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్, చెన్నూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వేల్పుల సాయిచందర్, ఎస్‌కే జమీర్, జాడి సాయిపవన్, ఎండీ అన్వర్, గుజ్జుల సాయితేజ, భీముల అంజిని బైండోవర్ చేశారు. బైండోవర్లనుఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని సీపీ హెచ్చరించారు.

'కాళేశ్వరం'లో లోపాలున్నాయని తెలిసినా చర్యలేవి?

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 6: కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో లోపాలు ఉన్నాయని నాలుగేళ్లుగా బీజేపీ నాయకులు చెబుతున్నారని, మరి ఎందుకు చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలను వెలికితీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశిస్తే బీజేపీ నాయకులు సీబీఐ ఎంక్వైరీ కోరడం హాస్యాస్పదమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను లొంగదీసుకోవడానికే బీజేపీ నాయకులు కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపించి బ్యారేజీ కుంగిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో సీడబ్ల్యూసీ అనుమతులు లేవని బీఆర్‌ఎస్‌వాళ్లే చెప్పారని అన్నారు. ప్రాజెక్ట్ అనుమతులు పరిశీలించి నిధులు ఇవ్వాల్సి ఉండగా, పూర్తి స్థాయిలో అనుమతులు లేని ప్రాజెక్ట్‌కు నిధులు ఏ విధంగా సమకూర్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పారదర్శకతతో వాస్తవాలను వెలికితీయాలనే భావనతో, న్యాయ విచారణకు ఆదేశిస్తున్న తరుణంలో బీజేపీ నాయకులు కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేపట్టడం లేదనడం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ప్రాణహిత తుమ్మడిహెట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వంతో గతంలోనే ఒప్పందం కుదిరిందని, కేవలం రూ.10 వేల కోట్లతో తుమ్మడిహెట్టి వద్ద నుంచి ప్రాణహిత ప్రవాహాన్ని మళ్లించి నుందిళ్లకు కలుపవచ్చని అన్నారు. ఒకే లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయవచ్చని, రెండు లిఫ్ట్‌ల భారం తగ్గిపోతుందని అన్నారు. తక్షణమే తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు వచ్చే మార్చి బడ్జెట్‌లో ప్రతిపాదించి, సంవత్సర కాలంలో నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో కొనసాగే పార్టీ అని, జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, నిరుపేద వర్గాలకు ఇళ్ల నిర్మాణం అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ఏ రాజకీయ పార్టీ కొత్తగా ఏ కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మెట్‌పల్లి, జనవరి 6: మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామ శివారులో మల్లన్న టెంపుల్ వద్ద ఎస్‌ఐ చిరంజీవి వాహనాల తనిఖీ చేపట్టగా ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా కనిపించిన యువకులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నిర్మల్ జిల్లా నుంచి మెట్‌పల్లికి టీఎస్ 21ఎల్1369 నెంబరు గల ద్విచక్రవాహనంపై గంజాయిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ శేఖర్, వీఆర్‌ఏ సమక్షంలో పంచనామా చేసి ఇరువురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకున్న ఎస్‌ఐ చిరంజీవి, ఏఎస్‌ఐ ప్రకాశ్, సిబ్బంది జలెందర్, సునీల్, మల్లేశ్‌లను సీఐ అభినందించారు.

సౌదీ అరేబియాలో దమ్మన్నపేట వాసి మృతి



రాజన్న (ఫైల్)

ధర్మపురి, జనవరి 6: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న (50) అనే వ్యక్తి సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం రాజన్న 11 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లాడు. రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఏడాది క్రితం కూడా ఇంటికి వచ్చి తిరిగి అక్కడికి వెళ్లాడు. రాజన్న పనిచేస్తుండగా రెండు నెలల క్రితం వాతం వచ్చినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం వల్ల అక్కడే ఆసుపత్రికి తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజన్న పరిస్థితి విషమించి ఈ నెల 4న మృతి చెందాడు. మృతుడు రాజన్నకు రావాల్సిన 11 ఏళ్ల ఇన్సూరెన్స్ లీగల్ డబ్బులు ఇప్పించాలని, మృతదేహాన్ని దమ్మన్నపేట స్వగ్రామానికి పంపించాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



లక్ష్మణ్‌కుమార్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ టౌన్, జనవరి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయాధికారుల స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీనాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనంగా గావించగా సూపరింటెండెంట్ అల్లి శంకర్ రాజన్న కండువా కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

జగిత్యాల టౌన్, జనవరి 6 :అనారోగ్య కారణంతో ఓ వివహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన బోగ సౌమ్య(36) అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తీవ్ర మనోవేధనకు గురైన సౌమ్య శనివారం తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ నటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: గత ఎన్నికల్లో తనను మోసం చేశారని సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేశ్; ఏలూరి రవి తనకు రూ. 1లక్ష ఇస్తానని చెప్పి ప్రచారం చేసేందుకు 15రోజుల్లో తిప్పుకున్నారని, ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసంచేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఐదుగురిపై అదనపు వరకట్నం కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: తనను అదనపు వరకట్నం తీసుకురావాలని తన భర్త, అత్త, మామలు తరుచూ వేధించారని సిరిసిల్ల పట్టణంలోని గాజుల నవ్య అనే మహిళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అదనపు వరకట్నం కింద శనివారం కేసు నమోదు చేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. తన భర్త గాజుల మల్లేశం, అత్త, మామ, ఆడబిడ్డలు వివాహమైనప్పటి నుంచి తనను వేధించి అదనంగా రెండు లక్షల రూపాయలు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేశారని బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు అయిదుగురిపై కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, జనవరి 6: సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాకం బానుచందర్, రాకం మనోహర్ తనకు ఇచ్చే ఎనిమిది లక్షల రూపాయలు తిరిగి ఇవ్వమని అడిగినందుకు చంపుతామని బెదిరించారని బాధితుడు రాగుల రాములు ఫిర్యాదుపై శనివారం ఇద్దరిపై కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జనవరి 6: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్ కు చెందిన రహీల్ అనే యువకుడు ఒక సెల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహం జరిగింది. భార్య ప్రస్తుతం గర్భవతి. షాపు నిర్వహణలో పలువరి వద్ద అప్పులు చేశాడని దానికి తోడు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద రుణాలు తీసుకున్నాడని అప్పుల వాళ్ల వేదింపులు, మరో వైపు మైక్రో సంస్థల ప్రతినిదులు వేదింపులు భరించలేక శుక్రవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా నీరుకుళ్ల మానేరు బ్రిడ్జి వద్దకు వెళ్లి గడ్డిమందు సేవించాడు. అతని అచూకీ గంట తర్వాత కనుగొన్న కటుంబ సభ్యులు ఉటాహుటిన అసత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ అటు నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం బాదితులు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 6: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శనివారం పిచ్చి కుక్క కరిసి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామంలోని దారి వెంట వెళుతున్న పోగుల కౌశిక్, దుర్గం రాఘవ, బోలమల్ల శివలపై పిచ్చికుక్క వెంటపడి దాడి చేసింది. దీంతో వారిని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయని, కొన్ని వీధి కుక్కలు రోగాల భారిన పడి సంచరిస్తున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి పిచ్చి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద కాలువకు నీటి విడుదల



రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

మల్యాల, జనవరి 6: వరదకాలువ కింద సాగు చేస్తున్న రైతులను ఆదుకోవడానికి ఎస్సారెస్పీ నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేయగా రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిగువకు విడుదల చేశారు. యాసంగి సాగు చేసిన రైతులు కాలువలో నీరులేక అందోళన చెందుతుండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇరిగేషన్ సీఈతో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో శనివారం నీరు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునే బాధ్యత తమదేనని ప్రతిపక్ష నేతలు ముసలి కన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని అన్నారు. యాసంగిలో గుంట పంట ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చెయకుండానే ముందస్తుగానే తామే నీటి విడుదల చేశామని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డీఈ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరబత్తిని ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ప్రగతి భవన్‌ను ప్రజా దర్బార్‌గా మార్చాం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

తంగళ్లపల్లి, జనవరి 6: ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రగతి భవన్ బారికేడ్లు తొలగించామని, ప్రజా దర్బార్‌గా మార్చామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడారు. నియంతృత్వ పాలన పోయి స్వేచ్ఛాయుత పాలన వచ్చిందని, గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామన్నారు. జిల్లాలో 5వ తేదీ వరకు ఆరు గ్యారెంటీలకు సంబంధించి లక్షా 50వేల 808 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. దీంతోపాటు మరో 20,014 రేషన్ కార్డు, ఇతరత్రా దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. చివరి రోజు మరో 30వేల దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారన్నారు. దరఖాస్తులను ఐదు రోజుల్లో కంప్యూటర్‌లో క్రోడీకరించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో కొన్నింటిని ఇప్పటికే అమలు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేసి తీరుతామన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పేదల పక్షాన ఉంటుందని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. దరఖాస్తుల్లో తప్పులు దొర్లితే పక్కకు పెట్టకుండా సరిచేసి పేదవారికి న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి, స్థానిక సర్పంచ్ అంకారపు అనిత రవీందర్, తహశీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో లచ్చాలు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని 27వ వార్డులో ప్రజాపాలన అభయహస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రణాళికలు జరుగుతున్నాయని, ఒక్కొక్కటిగా తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు వర్తించేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోలి మహేష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు ఉన్నారు.

చందుర్తి: అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని జడ్పీటీసీ నాగం కుమార్ అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలనలో అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చేరువగా పాలన అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో రవీందర్, సర్పంచ్ న్యాత విజయ జార్జ్, ఎంపీటీసీ గడ్డం రణధీర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గడ్డం పద్మ, మల్లారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: అట్టడుగువర్గాలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా రేపాక, సోమారంపేట, గొల్లపల్లి, అనంతగిరిలో శనివారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజల బాగోగులను పట్టించుకోక ప్రచారానికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అర్హులకు అందించాలనే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధితోపాటు అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, సర్పంచ్ మంద సుశీల లింగయ్య, ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, సర్పంచులు రొండ్ల లక్ష్మి, కాచం శ్రీనివాస్‌రెడ్డి, పల్లె నర్సింహరెడ్డి, ఎంపీటీసీలు కాథ సమలతమల్లేశం, గొట్టిపర్తి పర్శరాం, తహసీల్దార్ జావెద్ అహమ్మద్, ఎంపీడీవో మీర్జా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

నేరం చేస్తే శిక్ష తప్పదు

- శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు
- ఏడాదిలో 60 కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 6: నేరం చేస్తే శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ కోర్టులలో విధులు నిర్వహిస్తున్న ఏపీపీలు, పీపీలు, ఏజీపీలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షల పెంపుతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. గత ఏడాదిలో 60కి పైగా కేసుల్లో నిందితులకు జైలు శిక్షలు పడ్డాయన్నారు. నిందితులకు శిక్షలు పడేవిధంగా పీపీలు విశేష కృషి చేయడం అభినందనీయమన్నారు. కోర్టు కేసుల్లో నేరస్థులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చన్నారు. న్యాయాధికారులు, పోలీసు అధికారులు సమన్వయం పాటిస్తూ నేరస్థులకు శిక్షపడే విధంగా కృషిచేయాలన్నారు. పోలీస్ అధికారులు నిరంతరం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలిస్తూ ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. పోక్సో, హత్య కేసులు ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని, ప్రతి కేసులోనూ పంచనామా చేసే సమయంలో ప్రత్యక్ష సాక్షులను, ఫొటోలు, వివరాలు సమగ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. సాంకేతికత ప్రస్తుత రోజుల్లో కీలకంగా మారిందని, అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా జత చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా కృషి చేయాలన్నారు. కృషి చేసిన సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు. గడిచిన ఏడాదిలో 60 కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా జైలు శిక్ష విధించినట్లు చెప్పారు. కేసుల్లో నేరస్థులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పీపీ కె.నర్సింగరావు, పవన్ కుమార్, ఏపీపీ వి.లక్ష్మి ప్రసాద్, సందీప్, సతీష్, విక్రాంత్, జి.లక్ష్మణ్, పి.శ్రీనివాస్‌ను అభినందించారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, టౌన్ సీఐ ఉపేందర్, కోర్టు మానిటరింగ్ ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఏపీపీ, పీపీలతో ఎస్పీ అఖిల్ మహాజన్

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 6: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాదిగలపై నిర్లక్ష్యం వీడాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సంయుక్తంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో శనివారం మాదిగ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ మహాసభకు యూనివర్శిటీలో అనుమతి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. అనుమతిని నిరాకరించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ విషయంలో చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు ఖానపురం లక్ష్మణ్, యెలగందులు భిక్షపతి, ఆవునూరి ప్రభాకర్, రాజు, సురేష్, ఉదయ్, అక్షయ్, ప్రశాంత్, తేజ, బాలరాజు పాల్గొన్నారు.

8 నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

ఇల్లంతకుంట, జనవరి 6: మండలంలోని గ్రామాలలో ఈ నెల 8 నుంచి ఉపాధి హామీ గ్రామసభలు ఉంటాయని ఏపీవో చంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో చేపట్టిన పనులను పరిశీలిస్తారని, 12న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పబ్లిక్ హియరింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి



వినతి పత్రం అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

తంగళ్లపల్లి, జనవరి 6: జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మొట్టమొదటి సారిగా తంగళ్లపల్లికి వచ్చిన ఆది శ్రీనివాస్‌తోపాటు కాంగ్రెస్ నాయకుగు కేకే మహేందర్‌రెడ్డిని తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు ఆధ్వర్యంలో సభ్యులు సన్మానించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో 20 గుంటల స్థలం కేటాయించారని, దానికి సంబంధించిన ప్రొసీడింగ్‌తోపాటు నిర్మాణానికి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జర్నలిస్టుల పట్ల సానుకులంగా ఉన్నారని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు

- మరమ్మతు మరిచిన అధికారులు
- భయాందోళనలో వాహనదారులు



సుద్దాల-రామన్నపేట రహదారిపై కూలిన కల్వర్టు

కోనరావుపేట, జనవరి 6 : వరద తాకిడికి కల్వర్టు కూలిపోతోంది. అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో వాహనదారులు భయాందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. కోనరావుపేట మండలం సుద్దాల నుంచి రామన్నపేట మీదుగా కొలనూరు, సిరిసిల్లకు వెళ్లే ప్రధాన రహదారిపై కల్వర్టు గతేడాది కురిసిన భారీ వర్షాలకు కూలిపోయింది. కూలిన కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టకపోవడంతో భయంతో వాహనదారులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. లారీలు, ఆర్టీసీ బస్సులు భారీ వాహనాలు వెళ్లడం లేదు. ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. భారీ వాహనాల రాకపోకలకు వీలుకావడం లేదు. వేములవాడ కామన్ మీదుగా వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, కల్వర్టుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి

- కాదాసు సుధాకర్, సుద్దాల



సుద్దాల, రామన్నపేట మధ్యలో కూలిన కల్వర్టుకు మరమ్మతు చేపట్టాలి. గతేడాది వర్షాలకు కల్వర్టు కూలిపోయింది. పెద్ద వాహనాలు వెళ్లని పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. వెంటనే పనులు చేపట్టాలి.

అయోధ్య రాముడి అక్షింతలతో శోభాయాత్ర



ఎల్లారెడ్డిపేటలో శోభాయాత్రలో భక్తులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 6: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, బొప్పాపూర్ తదితర గ్రామాల్లో అయోధ్య నుంచి తెచ్చిన రాముడి అక్షింతలను స్థానికులు, భక్తులు శనివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ నెల 22న సాయంత్రం ఐదు దీపాలను వెలిగించాలని, అక్షింతలను శ్రీరాముడి విగ్రహానికి, ఇష్ట దేవుడికి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రామ మందిర తీర్థ ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అయోధ్య రాముడి పూజిత అక్షింతలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయి. అక్షింతలను మండల కేంద్రంలో ప్రతీ ఇంటికి చేర్చారు. గ్రామ పురోహితుడు రాచర్ల పార్థసారథి శర్మ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం మంగళపల్లి, నాగారంలో శనివారం అయోధ్య రామయ్య అక్షింతలను భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రజాప్రతినిధులు గోపాడి సురేందర్‌రావు, జ్యోతి, ఉప్పుల శ్రీకాంత్, నాగరాజు, అవురం తిరుపతి, అవురం శరత్, సురేష్, వెలిశాల వేణు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాలను పంచాయతీలుగా చేస్తాం



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 6: గత ప్రభుత్వం మున్సిపల్‌లో విలీనం చేసిన ఏడు గ్రామాలను తిరిగి గ్రామ పంచాయతీలుగా చేస్తామని కాంగ్రెస్ నియోజకర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో చంద్రపేటకు చెందిన వివిధ కుల సంఘాల నాయకులు మహేందర్‌రెడ్డిని కలిశారు. చంద్రంపేట పంచాయతీని మున్సిపల్‌లో విలీనం చేసి గత ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేసిందని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి తమ గ్రామాన్ని గ్రామ పంచాయితీగా చేసే విధంగా చూడాలని కోరుతూ కేకే మహేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నానన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు ఆధ్వర్యంలో కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో 15వ వార్డుకు చెందిన దాదాపు 20 మంది యువకులు పార్టీలో చేరారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, నాయకులు కొలనూరు రమాదేవి, తడక వెంకటేశం, మ్యాన సత్య నారా యణ, ఎల్లయ్య, శంకర్, రెడ్డి సంఘం, ఏకలవ్య సంఘం,ముదిరాజ్ సంఘం, వడ్డెర సం ఘం, మున్నూరు సంఘం, పద్మశాలి సంఘం, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఒకే కూపన్‌పై రోజంతా సరఫరా - నంబరు ప్లేట్ లేకుండా రోడ్ల మీదకు వాహనాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి - పట్టించుకోని అధికార యంత్రాంగం



నంబర్ లేని ట్రాక్టర్

వీర్నపల్లి, జనవరి 6: వీర్నపల్లి మండలంలోని అక్రమార్కులు అడ్డూఅదుపు లేకుండా ఇసుక అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. తెల్లవారిందంటే చాలు నంబర్ ప్లేట్లు, అనుమతి పత్రాలు లేని ఇసుక ట్రాక్టర్లు రోడ్డెకుతున్నాయి. పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ముందు నుంచే ఇసుక ట్రాక్టర్లు నడుస్తున్నా పట్టించుకునేవారు లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, వన్‌పల్లి వాగుల నుంచి అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. నిబంధనల మేరకు ప్రతీ వాహనానికి నంబరు ప్లేట్ ఉండాలి. కానీ ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేవు. దీనికితోడు రహదారుల మీదుగా అతివేగంగా రాంగ్‌రూట్లలో ట్రాక్టర్లను నడిపిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. ట్రాక్టర్లకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక ట్రిప్పుకు రూ.300 ప్రభుత్వ ఫీజు చెల్లించి అధికారుల అనుమతి రవాణా చేయాలని, ఇక్కడ అలాంటి నిబంధనలు పాటించడంలేదని మండిపడుతున్నారు. ఇసుక రవాణాదారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా అధి కారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నంబర్ ప్లేట్ లేకుండా నడుస్తున్న ఇసుక ట్రాక్టర్

వ్యాపార, వాణిజ్య సంస్థల్లో భద్రతా చర్యలు తప్పనిసరి

సిరిసిల్ల క్రైం, జనవరి 6: వ్యాపార, వాణిజ్య సంస్థల్లో ప్రజా భద్రతా చర్యలు తప్పనిసరని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 100 మంది కన్నా ఎక్కువ జనసంచారం ఉండే సంస్థల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో కమర్షియల్ కాంప్లెక్స్, లాడ్జీలు, షాపింగ్ మాల్స్, విద్యాసంస్థలు, తదితర వాటిల్లో ఈ నెల 27లోగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ తర్వాత తనిఖీలు ముమ్మరం చేస్తామన్నారు. సీసీ కెమెరాలు లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



క్రీడాకారులతో అధికారులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 6: కబడ్డీ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ కోసం నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జిందం చక్రపాణి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలురు జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్స్ కబడ్డీ క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న మెదక్ జిల్లా గజ్వేల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టు క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్, మాజీ జడ్పీటీసీ శ్రీకుమార్, కబడ్డీ అసోసియేషన్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి

వేములవాడ టౌన్, జనవరి 6 : యువత స్వయం ఉపాధిపై కూడా దృష్టిసారించాలని, వ్యాపారాల్లో రాణించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ఏర్పాటు చేసిన ఓ హోటల్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కంకాణాల సాయిశరత్ తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన నివాళి

చందుర్తి, జనవరి 6 : చందుర్తి మండలం బండపల్లికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గడ్డం తిరుపతిరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్తూపం వద్ద నివాళులర్పించారు. జడ్పీటీసీ నాగం కుమార్, గ్రామ సర్పంచ్ విజయ జార్జ్, ఎంపీటీసీ గడ్డం రణధీర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముస్కు పద్మమల్లారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చందుర్తి, జనవరి 6 : చందుర్తి మండలంలోని మూడపెల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్‌లో ధర్మ టీచర్ యూనియన్ ఆవిర్భావ సభ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ఆవిర్భావ సభ సన్నాహ కమిటీ సభ్యుడు సంపత్ రమేష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసమే ధర్మ టీచర్ యూనియన్ ఏర్పడుతుందన్నారు. జనవరి 3 నుంచి బోధన్‌లో ధర్మ టీచర్ యూనియన్ ఆవిర్భావ శిలాఫలకం ప్రారంభమైందన్నారు. ఈ నెల 7న హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముగింపు సభ ఉంటుందని తెలిపారు.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట

ఎల్లారెడ్డిపేట, జనవరి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన పలువురు మహిళలు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజేందర్, కృష్ణమూర్తి, బుచ్చాగౌడ్, బాబు, తిరుపతి, రాములు, రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల అందజేత

ఇల్లంతకుంట, జనవరి 6: మండలంలోని గాలిపెల్లికి చెందిన క్రీడాకారులకు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్లను శనివారం సేవా హాస్పిటల్ ఎండీ బద్దం శేఖర్‌రెడ్డి అందజేశారు. క్రీడాకారులకు సమాజంలో మంచి గౌరవం ఉందని, క్రీడలను ప్రోత్సహించడానికి ముందుంటానని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు శేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

10న రాణా దివస్

చందుర్తి, జనవరి 6 : చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 10న రాణా దివస్ నిర్వహించనున్నట్లు సీఐ కిరణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో పోలీస్ శాఖ కీలకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా విన్నపాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, జనవరి 6: రుద్రంగి మండల కేంద్రానికి చెందిన గడ్డం రాజవ్వ, సుమంత్ కాంతవ్వ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎనుగు మనోహర్ రెడ్డి పరామర్శించారు. ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, జట్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ మాడిశెట్టి ఆనందం, కోడగంటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.